సాక్షి
నారాయణపేట
శనివారం । 12 । ఆగస్టు । 2023



జూరాలకు తగ్గిన ఇన్‌ఫ్లో
ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టింది.
వివరాలు 10లో ▸



'దుమ్ము' లేస్తుంది..
పాలమూరు– చించోలి రహదారి పనులతో దుమ్ము లేచి ఇబ్బంది పడుతున్నారు.
వివరాలు 10లో ▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
34.6 /23.1
ఉదయం నుంచి ఎండ ఉంటుంది. సాయంత్రం కొంత మేఘావృతం అవుతుంది. వర్షం పడే అవకాశం లేదు.

న్యూస్‌రీల్

పింక్ వాట్సాప్‌తో జాగ్రత్త





నారాయణపేట: పింక్ వాట్సాప్ అంటూ మీ ఫోన్‌కి వచ్చే ఫార్వర్డ్ మేసేజ్‌లను నమ్మి మోసపోవద్దని.. ఆ లింక్‌ని క్లిక్‌చేసి యాప్ ఇన్‌స్టాల్ చేస్తే మీ ఫోన్‌లో ఉన్న పూర్తి డాటా ఫొటోస్, కాంట్రాక్ట్, బ్యాంక్ వివరాలు, ఓటిపి మొదలైనవి సైబర్ నేరగాల చేతిలోకి వెళ్లిపోతాయని.. జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ ఎస్.వెంకటేశ్వర్లు సూచించారు. శుక్రవారం ఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు నెటిజన్లను మోసం చేసేందుకు రోజుకో కొత్త పంథాను ఎంచుకుంటున్నరన్నారు. తాజాగా పింక్ వాట్సాప్ పేరుతో ఓ లింక్‌ను సర్క్యులేట్ చేస్తున్నారని, ఒక వేళ ఈ లింక్‌ను క్లిక్ చేస్తే మీ ఫోన్‌లో ఉన్న సమాచారమంతా సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లిపోతుందని, మీరు ఇప్పటికే ఈ లింక్‌ను క్లిక్ చేసి డౌన్‌లోడ్ చేసుకొని ఉంటే వెంటనే అన్ ఇన్‌స్టాల్ చేయాలన్నారు. అదేవిధంగా మీ బ్యాంకు ఖాతాల, సోషల్ మీడియా అకౌంట్ల పాస్‌వర్డ్‌లను మార్చుకోవాల్సి ఉంటుందన్నారు. ఇటువంటి మోసాలు ప్రజలు ఖచ్చితంగా తెలుసుకోవడం చాలా ముఖ్యమని, సైబర్ నేరగాళ్లు పంపే లింకులు, సందేశాల బారిన పడకుండా ఉండాలన్నారు. సైబర్ నేరగాళ్లు మన సమాచారాన్ని వారి ప్రయోజనం కోసం ఉపయోగించవచ్చు. డెబిట్, క్రెడిట్ కార్డు సమాచారాన్ని కోల్పోవడం ద్వారా ఆర్థిక నష్టం ఆధారాల దుర్వినియోగం అవుతుందన్నారు. సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్ , డయల్ 100కి సమాచారం ఇవ్వాలని ఎస్పీ తెలిపారు.

కొడంగల్‌కు 'పాలమూరు' ద్వారా కృష్ణా జలాలు



కోస్గి/మద్దూరు: రానున్న కొన్ని రోజుల్లోనే పాలమూరు – రంగారెడ్డి పథకం ద్వారా కొడంగల్ నియోజక వర్గానికి కృష్ణా జలాలు అందించనున్నామని, ఈ మేరకు కోర్టు అనుమతులు సైతం లభించడంతో పనులు శరవేగంగా కొనసాగుతాయని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కానుకుర్తిలో రిజర్వాయర్ ఏర్పాటు చేయడంతో కొడంగల్ నియోజకవర్గంలో 1.49 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. తాజాగా 12 చెక్‌డ్యాంల నిర్మాణానికి రూ.50.76 కోట్లు మంజూరయ్యాయని, నియోజకవర్గంలో మూడు గురుకుల రెసిడెన్షియల్ భవనాల నిర్మాణం కోసం రూ. 15 కోట్లు కేటాయించారన్నారు. కార్యక్రమంలో ఇందులో మున్సిపల్ చైర్‌పర్సన్ మ్యాకల శిరీష, ఎంపీపీ మదుకర్ రావు, జెడ్పీటీసీ సభ్యుడు ప్రకాష్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ శ్యాసం రామకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ భీంరెడ్డి, పార్టీ అధ్యక్షుడు రాజేష్, కౌన్సిలర్లు మాస్టర్ శ్రీను పాల్గొన్నారు.

పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన
మద్దూరు: ఉపాధి హామీ, జీపీ నిధులు రూ.40 లక్షలతో మద్దూరులో నిర్మించే పంచాయతీ భవనానికి, కొత్తపల్లి పంచాయతీ భవనానికి ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, స్థానిక సర్పంచులు అరుణ, సుభాషిణితో కలిసి శంకుస్థాపన చేశారు. మద్దూరులో రోడ్డు విస్తరణ పనులు వెంటనే ప్రారంభిస్తామని, అలాగే శేరి వెంకటాపూర్ నుంచి మద్దూరు, మద్దూరు, పెదిరిపాడ్ వరకు డబుల్‌రోడ్ మంజూరైనట్లు ఆయన పేర్కొన్నారు. మద్దూరు డిగ్రీ కళాశాల మంజూరు సీఎం కేసీఆర్‌ను కోరినట్లు అయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో పీఏసీఎస్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, నాయకులు వెంకటయ్య, మదుసూదన్‌రెడ్డి, హన్మిరెడ్డి, వీరారెడ్డి, వెంకట్ రాములుగౌడ్, వీరేష్‌గౌడ్ పాల్గొన్నారు.


పెరుగుతున్న దరఖాస్తులు

మహబూబ్‌నగర్ క్రైం: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మద్యం దుకాణాలకు టెండర్ల జోరు పెరిగింది. గడువు దగ్గర పడుతున్న నేపథ్యంలో మద్యం వ్యాపారులు పోటీ పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని 230 దుకాణాలకు గాను శుక్రవారం 499 టెండర్లు దాఖలయ్యాయి. ఇందులో మహబూబ్‌నగర్‌లో 243, నాగర్‌కర్నూల్‌లో 116, గద్వాలలో 74, వనపర్తిలో 66 టెండర్లు వేశారు. దీంతో ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలోని ఆయా దుకాణాలకు గాను 704 దరఖాస్తులు వచ్చాయి. వీటి ద్వారా ప్రభుత్వానికి రూ.14.8 కోట్ల ఆదాయం సమకూరింది. మహబూబ్‌నగర్ 352,నాగర్‌కర్నూల్ 153, గద్వాల 105, వనపర్తి 94 ఉన్నాయి. ఈ నెల 18 వరకు గడువు ఉండటం వల్ల ఇకపై దరఖాస్తులు భారీగా పెరగనున్నాయి.

పాలమూరులో వేగం

పర్యావరణ అనుమతులు లభించడంతో లైన్‌క్లియర్

- జోరందుకోనున్న సాగు నీటి నిర్మాణ పనులు
- డ్రైరన్‌కు ఏర్పాట్లు.. ఈ నెలాఖరులో 6 మోటార్లతో పంపింగ్
- 3 జలాశయాల కింద 5 ప్రధాన కాల్వల తవ్వకాలకు సన్నాహాలు
- 8 వేల ఎకరాల భూసేకరణకు సమాయత్తం
- త్వరలో టెండర్లు ఆహ్వానించే అవకాశం



నిర్మాణం పూర్తయిన ఏదుల రిజర్వాయర్

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: రాష్ట్రంలో ఉమ్మడి పాలమూరుతోపాటు రంగారెడ్డి, నల్లగొండ జిల్లాలను సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతలకు అడ్డంకులు తొలగిపోయాయి. రెండో దశకు సంబంధించి కేంద్ర పర్యావరణ అనుమతులు లభించడంతో ప్రాజెక్ట్ నిర్మాణానికి లైన్‌క్లియర్ అయింది. ఈ మేరకు సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతుండగా.. సాగునీటి నిర్మాణ పనుల్లో వేగం పెంచేలా రాష్ట్ర ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతోంది. వచ్చే ఎన్నికల్లోపు అంటే రెండు, మూడు నెలల్లో పనులను పూర్తి చేసి సాగు, తాగు నీరందించే కార్యాచరణతో ప్రభుత్వ యంత్రాంగం అడుగులు వేస్తోంది.

ఇదీ నేపథ్యం..
శ్రీశైలం బ్యాక్‌వాటర్ ఆధారంగా రోజుకు 1.5 టీఎంసీల చొప్పున 60 రోజుల్లో 90 టీఎంసీల నీటిని ఎత్తిపోసి.. ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల పరిధిలోని 70 మండలాల్లో 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు.. 1,226 గ్రామాలకు తాగునీటితో పాటు పరిశ్రమలకు సైతం నీరందించాలనే లక్ష్యంతో పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టారు. 2015లో రూ.35,200 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. 2016లో సీఎం కేసీఆర్ భూత్పూర్ మండలం కర్వెన వద్ద రిజర్వాయర్ పనులను ప్రారంభించారు. ప్రాజెక్టు నిర్మాణానికి అడుగడుగునా అడ్డంకులు ఎదురు కాగా.. ఇప్పటి వరకు పనులు సాగుతూనే ఉన్నాయి. ప్రస్తుతం ఈ పనుల అంచనా విలువ రూ.52 వేల కోట్లకు పెరిగింది.

ఎట్టకేలకు అనుమతులు
పర్యావరణ అనుమతులు లేవనే కారణంతో ప్రాజెక్ట్ పనులను నిలిపివేస్తూ ఎన్జీటీ ఈ ఏడాది మొదట్లో ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. తాగునీటికి సంబంధించి 7.15టీఎంసీల నిల్వకు సంబంధించిన పనులకు మాత్రమే అనుమతి ఇచ్చింది. ఈ మేరకు ఆయా పనులు కొనసాగుతుండగా.. తాజాగా రెండోదశ పనులకు పర్యావరణ అనుమతులు లభించిన నేపథ్యంలో సాగునీటి పనులు కూడా వేగం పుంజుకోనున్నాయి.

పనుల పూర్తి ఇలా..
పాలమూరు ఎత్తిపోతల పథకంలో మొత్తం నాలుగు లిఫ్టులు, ఐదు జలాశయాలు నిర్మిస్తున్నారు. 2021 అక్టోబర్ 31 నాటికి నార్లాపూర్ జలాశయం పనులు 89.44 శాతం, ఏదుల 90, వట్టెం 70, కర్వెన 60, ఉదండాపూర్ జలాశయం 48 శాతం పూర్తయినట్లు కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ పరిధిలోని పర్యావరణ అనుమతుల కమిటీ (ఈఏసీ) అధ్యయన నివేదికలో పేర్కొంది.

నార్లాపూర్ ప్రాజెక్టు కాల్వ



వట్టెం రిజర్వాయర్



కర్వెన రిజర్వాయర్



ట్రయల్ రన్‌కు సన్నాహాలు..
పాలమూరు ఎత్తిపోతలలో భాగంగా పంప్‌హౌస్‌ల వద్ద పలు మోటార్ల ద్వారా ట్రయల్ రన్‌కు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. దీని కోసం నార్లాపూర్‌లోని లిఫ్ట్–1, ఏదులలోని లిఫ్ట్–2, వట్టెంలోని లిఫ్ట్–3లో రెండేసి చొప్పున మొత్తం ఆరు మోటార్లను సిద్ధంగా ఉంచారు. ఇప్పటికే ఏదుల వద్ద ట్రయల్ రన్‌కు కావాల్సిన ఏర్పాట్లు చేయగా.. విద్యుత్ సబ్‌స్టేషన్ చార్జి ప్రక్రియ విజయవంతమైంది. అదే విధంగా నార్లాపూర్, వట్టెం పంప్‌హౌస్ వద్ద విద్యుత్ సబ్‌స్టేషన్లు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. సీఎం కేసీఆర్ మే నెలలో నిర్వహించిన సమీక్ష సందర్భంగా ఇచ్చిన ఆదేశాల మేరకు వారం పది రోజుల్లో తొలుత రెండు.. ఈ నెలాఖరు నాటికి మరో నాలుగు మోటార్ల ద్వారా నీటిని జలాశయాలకు పంపింగ్ చేసేలా అధికారులు పనుల్లో వేగం పెంచారు.

కేసీఆర్ పట్టుదలతోనే అనుమతులు..
పాలమూరుపై సీఎం కేసీఆర్‌కు ప్రత్యేకమైన ప్రేమాభిమానాలున్నాయి. ఇప్పటికే జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తయ్యాయి. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును అడ్డుకునేందుకు ప్రతిపక్షాలు ఎన్నో కుట్రలు చేశాయి. కేంద్రం అనేక కొర్రీలు పెట్టింది. పర్యావరణ అనుమతుల కోసం తెలంగాణ ప్రభుత్వం, కేసీఆర్ పట్టుదలతో చేసిన కృషి ఫలించింది. జిల్లా ప్రజల తరఫున కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు. ఈ ప్రాజెక్ట్‌తో ఉమ్మడి జిల్లా సస్యశ్యామలమవుతుంది. పనుల్లో వేగం పెంచి త్వరలో జాతికి సమర్పించే దిశగా పక్కా కార్యాచరణతో ముందుకు సాగుతున్నాం. – శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి

ప్రధాన కాల్వల తవ్వకాలకు టెండర్లు..
పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని మూడు ప్రధాన జలాశయాల కింద కాల్వల నిర్మాణానికి టెండర్లను పిలిచేందుకు నీటిపారుదల శాఖ అధికారులు సమాయత్తమైనట్లు తెలుస్తోంది. ఉదండాపూర్, వట్టెం జలాశయాల కింద రెండు, కర్వెన ప్రాజెక్ట్ కింద ఒకటి చొప్పున మొత్తం ఐదు కాల్వల నిర్మాణనికి సంబంధించి ఇప్పటికే మంత్రి వర్గ ఆమోదం లభించింది. ఈ ఐదు కాల్వల కింద 8 వేల ఎకరాల భూమిని సేకరించి.. 11.84 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందే అవకాశం ఉంది. భూ సేకరణ తదితర పనులకు అంచనా వ్యయం రూ.8,890 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్‌లో జలాశయాల వివరాలు..

రిజర్వాయర్	బండ్ పొడవు (కిలోమీటర్లు)	ఎఫ్‌ఆర్‌ఎల్ (మీటర్లు)	సామర్థ్యం (టీఎంసీ)	ఆయకట్టు (ఎకరాలు)
అంజనగిరి (నార్లాపూర్)	6.647	345.000	8.51	-
వీరాంజనేయ (ఏదుల)	7.716	445.000	5.91	-
వెంకటాద్రి (వట్టెం)	14.750	542.000	16.74	1,33,000
కురుమూర్తిరాయ (కర్వెన)	13.185	531.000	17.34	1,82,000
ఉదండాపూర్	15.875	629.000	16.03	9,00,000

లిఫ్ట్‌ల వారీగా సామర్థ్యం ఇలా..

లిఫ్ట్	ఎత్తు (మీటర్లు)	మోటార్లు	ఒక్క మోటార్ సామర్థ్యం	ఒక్కొక్కటి ఎత్తిపోసే నీరు
ఎల్లూరు	104	8	145 మెగావాట్లు	85 క్యూసెక్కులు
ఏదుల	124	9	145 మెగావాట్లు	75 క్యూసెక్కులు
వట్టెం	121	9	145 మెగావాట్లు	75 క్యూసెక్కులు
ఉదండాపూర్	131	5	145 మెగావాట్లు	75 క్యూసెక్కులు

జలాశయాల కింద నిర్మించనున్న కాల్వల వివరాలు..

జలాశయం	కాల్వ	అంచనా విలువ (రూ.కోట్లలో)	ఆయకట్టు (లక్షల ఎకరాల్లో)
ఉదండాపూర్	కుడి	2,930	3.98
	ఎడమ	2,700	5.02
వెంకటాద్రి (వట్టెం)	ప్రధాన	1,320	1.17
	లోలెవల్	170	0.16
కురుమూర్తిరాయ (కర్వెన)	ప్రధాన	1,770	1.82

అన్ని వర్గాలకు సముచిత స్థానం



లబ్ధిదారులకు రూ.లక్ష చెక్కు అందజేస్తున్న జెడ్పీచైర్‌పర్సన్ వనజ, ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మక్తల్: అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని, కులవృత్తుల వారికి సైతం రాష్ట్ర ప్రభుత్వం ఆసరాగా నిలుస్తోందని జెడ్పీచైర్‌పర్సన్ వనజ, ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మక్తల్ , మాగనూర్, కృష్ణ, నర్వ, ఊట్కూర్ మండలాలకు చెందిన 300మంది కులవృత్తుల వారికి ఒక్కొక్కరికి రూ.లక్ష ప్రోత్సాహక చెక్కులను అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ అభ్యున్నతి కోసం రూ.400 కోట్లు మంజూరు చేయడం జరిగిందని, త్వరలోనే మైనార్టీలకు ఒక్కొక్కరికి రూ.లక్ష ఇవ్వనున్నామని వారు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని, ప్రజలు సైతం తమ అభ్యున్నతికి పాటుపడుతున్న బీఆర్‌ఎస్ పార్టీకి అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు అశోక్‌గౌడ్, వెంకటయ్య, ఎంపీపీలు వనజ, శ్యామలమ్మ, ఎల్కోటి లక్ష్మి, పూర్ణిమ పటేల్, రమేష్, కాలప్ప, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసులు, సర్పంచ్‌లు గడ్డం రమేష్, దత్తు, ఎంపీడీఓ శ్రీధర్, ఎంపీఓ పావనీ తదితరులు పాల్గొన్నారు.

ఉరుకులు.. పరుగులు

- కేజీబీవీ సీఆర్‌టీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన
- కేవలం ఒక్క రోజే అవకాశం ఇవ్వడంపై సర్వత్రా విమర్శలు



అభ్యర్థుల ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న జీసీడీఓ బృందం

నారాయణపేట రూరల్: కేజీబీవీలో ఖాళీల భర్తీకి ఇటీవల రాతపరీక్ష నిర్వహించగా.. ఫలితాలు గురువారం రాత్రి విడుదలవగా, మరుసటి రోజైన శుక్రవారం అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన చేపట్టారు. ఒక్క రోజు సమయం కూడా ఇవ్వకపోవడంతో అభ్యర్థులు ఉరుకులు.. పరుగులు తీశారు. వివరాల్లోకి వెళ్తే.. ఇటీవల జిల్లాలోని 11 కేజీబీవీ పాఠశాలలు, 8 కళాశాలల్లో ఖాళీ ఉన్న ఆరు సీఆర్‌టీ, 37పీజీ సీఆర్‌టీలు పోస్టులకు పలువురు దరఖాస్తు చేసుకున్నారు. జూలైలో వీరికి ఆన్‌లైన్ ద్వారా రాతపరీక్ష నిర్వహించారు. అయితే దీనికి సంబందించిన ఫలితాలను గురువారం రాత్రి విడుదల చేశారు. వీరిలో ఒక్కో పోస్టుకు ముగ్గురు చొప్పున (1:3 నిష్పత్తిలో) 129 మంది అభ్యర్థులను రోస్టర్ పద్ధతిలో ఎంపిక చేశారు. వీరికి శుక్రవారం ఉదయం 11.30గంటలకు స్థానిక డీఈఓ కార్యాలయం నుంచి ఫోన్ చేసి ఇదే రోజు సాయంత్రం 5గంటల లోపు తమ సర్టిఫికేట్ల వెరిఫికేషన్ పూర్తి చేయించుకోవడానికి రావాలని ఆదేశించారు. అయితే ఎంపికైన వారిలో చాలా మంది గురుకుల పరీక్ష నిమిత్తం హైద్రాబాద్‌కు వెళ్లగా, మరికొందరు స్థానికంగా అందుబాటులో లేరు.

విమర్శలతో వెనక్కి తగ్గిన అధికారులు
కనీస సమయం ఇవ్వకుండా వెరిఫికేషన్‌కు రావాలని సూచిండంపై సర్వత్ర విమర్శలు రావడం , ఉపాధ్యాయ సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేయడంతో కొంత వెనిక్కి తగ్గి అభ్యర్థుల స్థానంలో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు ఎవరైన వర్జినల్ సర్టిఫికెట్లు తీసుకుని రావచ్చని, రాత్రి ఎంత సమయమైన కౌంటర్లు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. దీంతో అభ్యర్థులు, వారికి సంబంధించిన వారు పట్టణంలోని కేజీబీవీ వెరిఫికేషన్ కౌంటర్‌కు చేరుకున్నారు. అభ్యర్థుల తరపున వచ్చిన వారికి ఫారాలు నింపడం రాకపోవడంతో ఇతరులు నింపి ఇవ్వడం కనిపించింది.

సజావుగా ధ్రువపత్రాల పరిశీలన
జీసీడీఓ పద్మానళిని ఆద్వర్యంలో జీహెచ్‌ఎంలు బాలాజి, లక్ష్మి, సెక్టోరియల్ అధికారి నాగార్జున్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది ఉదయబాను, శ్రీకాంత్, మల్లికార్జున్, స్వాతి బృందం అభ్యర్థుల సర్టిఫికేట్లు పరిశీలించారు. ఆలస్యంగా వచ్చిన ప్రతి ఒక్కరికి ఫారాలు అందించి ధృవపత్రాలను పరిశీలించారు. అర్ధరాత్రి వరకు ప్రక్రియ కొనసాగింది. ఫలితాలపై ఎవరికైన సందేహాలు ఉంటే ఈ నెల 12న మధ్యాహ్నం 2గంటలలోగా డీఈఓ కార్యాలయంలో వినతులు అందించాలని జీసీడీఓ సూచించారు.

ఆర్టీసీ అభివృద్ధికి డ్రైవర్లు, కండక్టర్లే కీలకం



నారాయణపేట రూరల్: ఆర్టీసీ అభివృద్ధికి డ్రైవర్లు, కండక్టర్లే కీలకమని.. తాజాగా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించబడిన కార్మికులు రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలని ఆర్టీఓ వీరస్వామి అన్నారు. ఆర్టీసీ డిపోలో ఈపీకే, కేఎంపీఎల్ సాధించిన కండక్టర్, డ్రైవర్‌తో పాటు ఉత్తమ సేవలందించిన మెకానిక్‌లకు శుక్రవారం అభినందన సభను నిర్వహించగా.. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.ప్రతి ఒక్కరు యాక్సిడెంట్ ఫ్రీ డ్రైవర్లుగా నిలిచేందుకు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, సమయపాలన పాటిస్తూ, ప్రయాణికులతో మర్యాదగా వ్యవహరిస్తే తప్పకుండా వారి మన్ననలు పొందడంతోపాటు ఆర్టీసీకి మరింత లాభాలను తీసుకురావచ్చారు. కార్యక్రమంలో డీఎం లక్ష్మిసుధ, సీఐ అలివేలు, ఇంచార్జీ ఎంఎఫ్ యాదయ్య, సూపరింటెండెంట్ నరేందర్, ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్లు, ఏడీసీ ఉన్నారు.

ఎస్పీని కలిసిన డీఎం
ఇటీవల ఆర్టీసీ డీఎంగా బాధ్యతలు స్వీకరించిన లక్ష్మీసుధా ఎస్పీ ఎస్.వెంకటేశ్వర్లును మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందించారు. బస్టాండ్‌లలో ఆకతాయిలపై దృష్టిపెట్టాలని, పెట్రోలింగ్ వాహనం, పోలీసులను ఏర్పాటు చేయాలని కోరారు.

ఓటరు జాబితా మార్పు, చేర్పులపై ప్రత్యేక దృష్టి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

నారాయణపేట: ఓటరు జాబితా నమోదు, మార్పులపై తహసీల్దార్లు, బీఎల్‌ఓలు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ సమావేశ మందిరంలో ధరణి 58,59 తదితర అంశాలపై అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన వారిని ఓటరుగా నమోదు చేయాలని, 21న డ్రాఫ్ట్ విడుదల అవుతున్నందున లిస్టు సరి చూసుకోవాలన్నారు. కొత్తగా నమోదైన వారు ఎంత మంది ఉన్నారు పునః సమీక్షించాలని, ట్రాన్స్‌జెండర్లు, డబుల్ ఓటర్ నమోదు తదితర వాటిని సరిచూసుకోవాలన్నారు. తహసీల్దార్ సహాయంతో వలస ఓటర్ల వివరాలు ఆరా తీయాలని, కళాజాత సహాయంతో ఈవీఎంలపై అవగాహన కల్పించాలన్నారు. ధరణిలో కొత్త మాడ్యూల్స్ వచ్చాయని వాటిపై దృష్టి పెట్టాలన్నారు. హౌస్ సైట్ పట్టా డిస్ట్రిబ్యూషన్ చేయాలన్నారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ పి.అశోక్‌కుమార్, ఆర్డీఓ రాంచందర్‌నాయక్, ఏఓ నర్సింగ్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

ఉద్యానవన పంటలను ప్రొత్సహించాలి
జిల్లాలో ఉద్యానవన పంటలను ప్రొత్సహించే విధంగా ఉద్యానవన శాఖ కృషి చేయాలని కలెక్టర్ అన్నారు. శుక్రవారం జిల్లా ఉద్యానవనశాఖ, రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. జిల్లాలో అమలవుతున్న ఉద్యానవన పంటల సాగు వివరాలు , రికార్డులను కలెక్టర్ తనిఖీ చేశారు. అదేవిధంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రికార్డులు, డాక్యుమెంట్లను పరిశీలించి అధికారులతో పలు విషయాలపై ఆరా తీశారు.

పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి
పాఠశాలల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. శుక్రవారం నారాయణపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. గ్రౌండ్ పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకోవాలని హెచ్‌ఎంను ఆదేశించారు. డీడబ్ల్యూఓ, సీడీపీఓ కార్యాలయాలను కొత్తగా నిర్మిస్తున్న భవనంలోకి 15 రోజుల్లోగా మార్చాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం ఈవీఎం గోదాంను తనిఖీ చేశారు. కలెక్టర్‌తో పాటు అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిత్తల్, ఆర్డీఓ రాంచందర్ నాయక ఏఓ నర్సింగ్‌రావు, డిడబ్ల్యూఓ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పనుల జాప్యంపై అడిషనల్ కలెక్టర్ ఆగ్రహం



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిత్తల్

నారాయణపేట: జిల్లా కేంద్రంలో చేపట్టిన పలు అభివృద్ధి పనుల్లో జాప్యంపై మున్సిపల్ అధికారులపై జిల్లా అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిత్తల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం పట్టణంలోని యాదగిరి రోడ్డు ఎర్రగుట్ట సమీపాన 800 గజాల్లో రూ.2 కోట్ల అంచనాతో నిర్మిస్తున్న దోబిఘాట్ పనులను పరిశీలించి నిర్ణయించిన సమయానికి పనులు పూర్తి చేయించాలని అధికారులకు సూచించారు. అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని దామరగిద్ద రోడ్డు సమీపాన ఏకరలో శ్మశాన వాటిక సుందరీకరణ పనులను పరిశీలించి అసహనం వ్యక్తం చేశారు. ఊట్కూర్ మండలం పగిడిమారి రోడ్డులో నారాయణపేట మున్సిపాలిటీ డంపింగ్‌యార్డు పనులను పరిశీలించారు. డంపింగ్ యార్డులోని శ్మశాన వాటికలలో మొక్కలు నాటాలని సూచించారు. ఆయనతో పాటు మున్సిపల్ కమిషనర్ సునీత, అధికారులు ఆంజనేయులు, జ్ఞానేశ్వర్‌రెడ్డి, రాజునాయక్ లు ఉన్నారు.

పంచాయతీ భవన నిర్మాణాలు వేగవంతం
గ్రామ పంచాయితీ నూతన భవన నిర్మాణాల పనులు వేగవంతం చేయాలని అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిత్తల్ అధికారులకు సూచించారు. శుక్రవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ సమావేశ మందిరంలో జీపీ భవనాల స్థితిగతులపై అధికారులతో సమీక్షించారు. సమావేశంలో డీఆర్‌డీఏ, పీఆర్ ఈఈ, పీఆర్ ఏఈలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాము కాటుతో విద్యార్థి మృతి

రాజోళి: పాము కాటుతో విద్యార్థి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్ఐ ఖాదర్ బాషా తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన వీరశంకర్(13) జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో చదువుతున్నాడు. గురువారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి ఇంట్లోనే నిద్రించారు. ఈ సమయంలో పాము కాటు వేయడంతో గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూల్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. ఈ ఘటనపై తండ్రి బీచుపల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి బలవన్మరణం

బిజినేపల్లి: మండలంలోని బోరుసుగడ్డతండాకు చెందిన రాజు (38) అప్పుల బాధ తట్టుకోలేక శుక్రవారం తెల్లవారుజామున చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రాజు కుటుంబ పోషణ కోసం పలు చోట్ల అప్పులు చేసి, వాటిని తీర్చడానికి చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. దీంతో మనస్తాపానికి గురై శుక్రవారం ఉదయం తండాలోని ఒక చెట్టుకు ఉరేసుకున్నాడు. అటుగా వెళ్లిన వారు గమనించి మృతదేహాన్ని ఇంటికి చేర్చారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

జడ్చర్ల: పట్టణంలోని కొత్తబస్టాండ్ సమీపంలో జాతీయ రహదారిపై గురువారం అర్ధరాత్రి ఓ యువకుడు ప్రమాదానికి గురై దుర్మరణం చెందాడు. సీఐ రమేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని కర్నూల్ జిల్లా కొత్తపల్లికి చెందిన సద్దాం హుస్సేన్(28) జాతీయరహదారిని దాటుతున్న సమయంలో కర్నూల్ నుంచి హైదరాబాద్ వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి దగ్గర గల ఆధార్‌కార్డుతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈయన మూడేళ్ల క్రితం ఇంటి నుంచి బయటకు వచ్చి తిరిగి వెళ్లలేదన్నారు. అక్కడక్కడ దొంగతనాలు చేస్తూ తప్పించుకుంటున్నట్లుగా తమకు సమాచారం వచ్చిందన్నారు. శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

భూత్పూర్: పట్టణంలోని కేఎంఆర్ ఫంక్షన్‌హాల్ వద్ద రోడ్డుపై గురువారం మధ్యాహ్నం వాహనం ఢీకొన్న ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు చిన్నచింతకుంట మండలం పల్లమర్రికి చెందిన పూజారి వడ్ల నర్సింహులు (48) గురువారం మధ్యాహ్నం పనినిమిత్తం భూత్పూర్ చౌరస్తా నుంచి నడుచుకుంటూ మహబూబ్‌నగర్ వైపు వెళ్తున్నాడు. కేఎంఆర్ ఫంక్షన్‌హాల్ ఎదురుగా వెనుక నుంచి కారు ఢీకొట్టింది. దీంతో నర్సింహులు తలకు గాయాలు కాగా జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లో తీసుకెళ్లారు. అదేరోజు రాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. శుక్రవారం మృతుడి భార్య వడ్ల వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

చిరుత దాడిలో గొర్రె..

మరికల్: మండలంలోని పూసల్‌పహాడ్ పరిధిలోని సంజీవకొండపై శుక్రవారం గొర్రెల మందపై చిరుత దాడి చేసి ఓ గొర్రెను హతమర్చింది. సాయంత్రం కావడంతో గొర్రెల కాపారి కొండపై నుంచి కిందకు మందను తీసుకొస్తుండగా చెట్ల పొదల్లో ఉన్న చిరుత అకస్మాత్తుగా గొర్రెపై దాడి చేసి పట్టుకెళ్తుండగా కాపారులు అరుపులు, కేకలు వేయడంతో అక్కడే వదిలి వెళ్లింది. వారం రోజుల వ్యవధిలోనే రెండు మూగజీవాలపై చిరుత దాడి చేయడంతో అడవుల్లోకి వెళ్లాలంటేనే రైతులు, గొర్రెల కాపారులు భయపడుతున్నారు.

ఆన్‌లైన్ మోసంపై కేసు నమోదు

ఉప్పునుంతల: ఆన్‌లైన్ మోసం కేసు నమోదు చేసినట్లు శుక్రవారం హెడ్‌కానిస్టేబుల్ మల్లయ్య తెలిపారు. మండలంలోని దేవదారికుంటతండాకు చెందిన అనూష ఫోన్‌కు గత నెల 23న ఆన్‌లైన్‌లో డబ్బులు పెట్టుబడి పెడితే రెట్టింపు అవుతాయనే మెసేజ్ వచ్చింది. దాంతో ఆమె యాప్‌లో లాగిన్ అయ్యి మొదట రూ.10 వేలు, తర్వాత రూ.18 వేలు మొత్తం రూ.28 వేలు గూగుల్‌పే ద్వారా పంపించింది. రూ. 40 వేలు పంపిస్తే గానీ తాము రూ.80 వేలు పంపిస్తామని చెప్పారు. అనుమానం వచ్చిన అనూష వారిని నిలదీయడంతో వెంటనే సైబర్ నేరగాళ్లు ఆమె ఇన్‌స్టాగామ్‌ను బ్లాక్ చేశారని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

ముగ్గురు యువకుల రిమాండ్

ఊర్కొండ: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై అత్యాచారానికి పాల్పడి గర్భం దాల్చడానికి కారణమైన ముగ్గురు యువకులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ లెనిన్ తెలిపారు. బాలికను గర్భవతిని చేసిన ముగ్గురు యువకులు జిల్లా వరుణ్, మాడ్గుల శ్రీకాంత్, మాడ్గుల నవీన్‌లను శుక్రవారం సీఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో కల్వకుర్తి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్ఐ చెప్పారు.

‘దుమ్ము’ లేస్తుంది..



గండేడ్ మండలం సల్కర్‌పేట్ వద్ద రోడ్డుపై దుమ్ము

- మట్టి, కంకరతో కనిపించని రోడ్డు
- వాహనదారుల కళ్లల్లో దుమ్ము
- నానా పాట్లు పడుతున్న వైనం

గండేడ్: జాతీయ రహదారిగా విస్తరిస్తున్నందుకు సంతోషపడాలో.. లేక దుమ్ము, బురదతో ఇంకెన్ని రోజులు ఇబ్బందులు పడాలో అర్థం కాక వాహనదారులు తలలు పట్టుకుంటున్నారు. రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా నిర్మాణాలు చేపట్టాల్సిన కాంట్రాక్టర్, పర్యవేక్షించాల్సిన అధికారులు ఇవేమి పట్టించుకోకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. మహబూబ్‌నగర్–చించోలి జాతీయ రహదారి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. బెంగళూరు– ముంబాయి మధ్య ఉన్న జాతీయ రహదారులను అనుసంధానం చేసేందుకు మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని భూత్పూర్ నుంచి కర్ణాటకలోని మన్నెకలి వరకు ఉన్న 192 కిలోమీటర్ల మేర జాతీయ రహదారిగా విస్తరించడానికి రూ.703కోట్లు గతేడాది మంజూరయ్యాయి. రాష్ట్రంలో మూడు జిల్లాలను కలుపుతూ వెళ్తున్న ఈరోడ్డును 167 జాతీయ రహదారిగా గుర్తించారు. ఇందులో భాగంగానే మార్చిలో పనులు ప్రారంభించారు. మొదటి ప్యాకేజీలో భాగంగా భూత్పూర్ నుంచి దుద్యాల వరకు పనులు కొనసాగుతున్నాయి. ముందుగా కోస్గి నుంచి మహబూబ్‌నగర్ వైపు పనులు చేపడుతున్నారు.

నీళ్లు చల్లడంలో నిర్లక్ష్యం..

పనులు చేస్తున్న సమయంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా కాంట్రాక్టర్లు తగిన చర్యలు తీసుకోవాలి. అవి నామమాత్రంగానే చేపడుతున్నారు.



కొంరెడ్డిపల్లి సమీపంలో రోడ్డుపై దుమ్ము

కోస్గి, జానంపల్లి, రంగారెడ్డిపల్లి, సల్కర్‌పేట్, గండేడ్, కొంరెడ్డిపల్లి, మొకర్లాబాద్, మహమ్మదాబాద్ పరిధిలో ఇప్పటికే ముమ్మరంగా పనులు కొనసాగుతున్నాయి. కాంట్రాక్టర్లు ఎప్పటికప్పుడు మట్టి రోడ్డుపై, కంకర డస్టు వేసిన రోడ్డుపై నీళ్లు చల్లుతుండాలి. కానీ వారు ఇవేమి చేయడం లేదు. చల్లినపుడు పూర్తిగా బురద చేస్తున్నారు. లేకపోతే దుమ్ము లేసే దాక పట్టించుకోవడం లేదు.

కళ్లు పొడవుతున్నాయి..



ప్రతి రోజు మహబూబ్‌నగర్ నుంచి రెడ్డిపల్లికి బైక్‌పై వస్తుంటాయి. రోడ్డు విస్తరణ కారణంగా రాకపోకలు సాగించడం భయంగా ఉంది. దుమ్ముతో ఎదురుగా వచ్చే వాహనాలు ఏవీ కనిపించడం లేదు. కళ్లు పొడవుతున్నాయి. కల్వర్టుల నిర్మాణం వద్ద రోడ్డు ఇరుకుగా ఉంటుంది. రోడ్డు నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రయాణం నరకమే. అధికారులు ఇబ్బందులు కలగకుండా తగు ఏర్పాట్లు చేయాలి.

– సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయుడు, రెడ్డిపల్లి

ఇబ్బందులు కలగకుండా చూస్తాం..



రోడ్డుపై వేళ్లే వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తాం. ప్రతి రోజు అవసరమైన మేర నీళ్లు చల్లించేలా చర్యలు తీసుకుంటాం. బురద కాకుండా, దుమ్ము లేవకుండా నీళ్లు చల్లేలా కాంట్రాక్టర్‌ను ఆదేశిస్తాం.

– రమేష్, నేషనల్ హైవే, డీఈ, మహబూబ్‌నగర్

విపరీతమైన రద్దీ..

ఈరోడ్డు ముంబాయి – బెంగళూరుకు దాదాపు 150 కిలోమీటర్ల దూరం తగ్గడం మూలంగా విపరీతమైన రద్దీ ఉంటుంది. నిత్యం అధిక సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో కిలోమీటర్ల కొద్ది దుమ్ము లేవడంతో వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. ద్విచక్రవాహనదారుల పరిస్థితి అయితే మరీ దారుణం. రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ముందుగా మట్టి వేయించారు. ఒకవైపు నుంచి ముందుగా ఉన్న బీటీని తొలగిస్తూ కంకర, డస్టు పోస్తూ రోలర్‌తో తొక్కిస్తున్నారు. అయితే ముందుగా పోసిన మట్టి, కంకర, డస్టు కారణంగా దుమ్ము ఎక్కువ మొత్తంలో లేస్తుంది. కొన్ని చోట్ల కల్వర్టులు సైతం నిర్మిస్తుండడంతో అక్కడ కూడా విపరీతంగా దుమ్ము లేస్తుంది. కోస్గి మండలం సంపల్లి నుంచి బీటీ ఓవైపు ప్రారంభమైన, మరోవైపు నుంచి మహమ్మదాబాద్ వరకు వెళ్లాలంటే తలప్రాణం తోకకు వస్తుంది. నిత్యం ఈ రోడ్డు మీదుగా రాకపోకలు సాగించే వారు చాలా మంది ఉన్నారు. వారికి దుమ్ముతో ఆయాసం సమస్యలు కూడా వచ్చే ప్రమాదం ఉంది. బస్సుల్లో సైతం సీట్లు దుమ్ముతో నిండిపోతున్నాయి. దుమ్ముకు తోడు గుంతలు ఉండడంతో బస్సుల్లో ప్రయాణం నరకంగా మారింది.

అరకొరగానే సేవలు

నామమాత్రంగా సాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలు

- సగానికి సగం మాత్రమే హాజరవుతున్న చిన్నారులు
- వేళకు భోజనం పెట్టి నెట్టుకొస్తున్న అంగన్‌వాడీ టీచర్లు
- కొన్నిచోట్ల పట్టింపు లేని వైఖరి అవలంబిస్తున్న వైనం
- నిర్వహణపై కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ

సాక్షి విజిట్

అంగన్‌వాడీ కేంద్రాలు.. చిన్నారులను పాఠశాలలకు వచ్చేలా చేయడంతోపాటు కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించేందుకు ఏర్పాటు చేశారు. అయితే జిల్లాలో కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలు నామమాత్రంగా మారాయి. సెంటర్‌కు వచ్చే చిన్నారులకు.. రిజిష్టర్‌లో నమోదు చేసే పేర్లకు పొంతనే కుదరడం లేదు. కొన్నిచోట్ల సగానికి సగం మంది రాకపోయినా వచ్చినట్లు రాసుకుంటున్నారు. అలాగే వివిధ రకాల సమావేశాల పేరిట టీచర్లు సెంటర్లను ఆయాలకు వదిలేసి పట్టింపులేని వైఖరి అవలంబిస్తున్నారు. దీంతో వారు వచ్చిన పిల్లలకు వండిపెట్టడం వరకే పరిమితమవుతున్నారు. ప్రధానంగా ఈ కేంద్రాలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నిర్వహణ మొత్తం ఇష్టానుసారంగా మారింది. ఈ క్రమంలో శుక్రవారం ‘సాక్షి’ జిల్లాలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను పర్యవేక్షించగా పై విషయాలు వెలుగులోకి వచ్చాయి.

– సాక్షి నెట్‌వర్క్

తెరుచుకోని కేంద్రం



చౌలతండాలో తెరుచుకోని అంగన్‌వాడీ కేంద్రం

భూత్పూర్ మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలు పర్యవేక్షణ లోపంతో అధ్వానంగా మారాయి. శుక్రవారం చౌలతండాలో అంగన్‌వాడీ సెంటర్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహిస్తుండగా.. తాళం వేసి ఉంది. పెద్దతండా అంగన్‌వాడీ కేంద్రంలో ఐదుగురు చిన్నారులకు గాను ఇద్దరు, కర్వెన 4వ అంగన్‌వాడీ కేంద్రంలో 10 మందికి గాను ఒక్కరు, రెండో కేంద్రంలో 12 మందికి గాను ఆరుగురు, తాటిపర్తి రెండో అంగన్‌వాడీ కేంద్రంలో 20 మందికి గాను 10 మంది, ముస్లాయిపల్లిలో 10 మందికి ఏడుగురు చిన్నారులు హాజరు కాగా.. సమయానికి భోజనం పెట్టకుండా గుడ్లు మాత్రమే ఇస్తున్నారు.

ఒక్కరూ రాలేదు..



చిన్నచింతకుంటలోని 1, 2 అంగన్‌వాడీ కేంద్రాలకు హాజరుకాని విద్యార్థులు

చిన్నచింతకుంటలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో హాజరు శాతం అంతంతగానే ఉంది. స్థానిక ఒకటో కేంద్రంలో 16 మంది విద్యార్థులకు గాను ఒక్కరు కూడా హాజరు కాలేదు. రెండో సెంటర్‌లో 19కి 10 మంది హాజరైనట్లు రిజిస్టర్‌లో నమోదు చేసినా ఎవరూ కనిపించలేదు. అయితే ఆయా లేకపోవడంతో విద్యార్థులకు భోజనం పెట్టి పంపించినట్లు కార్యకర్త తెలిపారు. మూడో కేంద్రంలో 6 మంది, 5వ కేంద్రంలో 8 హాజరయ్యారు. ఆయా కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం ప్రతిరోజు అందిస్తున్నారు.

సగం మందే హాజరు..



మూసాపేట మండలం తుంకినీపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఇలా..

మూసాపేట మండలం తుంకినీపూర్ అంగన్‌వాడీ కేంద్రానికి టీచర్ మంజుల విధులకు హాజరు కాలేదు. కేవలం ఆయా సుజాత సెంటర్‌ను తెరవగా 12 మంది పిల్లలకు గాను ఆరేడు మంది మాత్రమే వచ్చారు. అంగన్‌వాడీ టీచర్ దేవరకద్రలో మీటింగ్‌కు వెళ్లారని ఆయా చెప్పారు. కేంద్రానికి వచ్చిన పిల్లలకు ఆయా వంటలు సిద్ధం చేసింది. గురు, శుక్రవారాలకు సంబంధించి పిల్లల హాజరును రిజిష్టర్‌లో నమోదు చేయలేదు. గర్భిణులు, బాలింతలు తమకు వచ్చే పౌష్టికాహారాన్ని కుటుంబ సభ్యులను పంపించి ఇంటికి తీసుకెళ్తున్నారు. గుడ్లు, పౌష్టికాహారం బాగానే అందిస్తున్నట్లు తెలిసింది.

18 మందికి 11 హాజరు

నవాబుపేటలోని మూడో అంగన్‌వాడీ కేంద్రంలో 18 మంది చిన్నారులకు గాను 11 మంది హాజరయ్యారు. వరుసగా రెండురోజుల నుంచి 14, 16 మందే రావడం గమనార్హం. ఈ కేంద్రంలో ఇద్దరు గర్భిణులు, ఇద్దరు బాలింతలు ఉండగా వారు కేంద్రానికి వచ్చి భోజనం చేసి వెళ్తున్నారు. పాలు, గుడ్లతోపాటు భోజనం పెడుతున్నట్లు గర్భిణులు పేర్కొన్నారు. మండలంలో మొత్తం 81 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా వాటిలో 0–3 మూడేళ్లలోపు చిన్నారులు 2,484 మంది ఉన్నారు.



అంగన్‌వాడీ కేంద్రానికి హాజరైన చిన్నారులు

పోలేపల్లి సెజ్‌లో కంటెయినర్ దగ్ధం

జడ్చర్ల: మండలంలోని పోలేపల్లి సెజ్‌లో ఓ ఫార్మ పరిశ్రమకు రసాయన ముడి పదార్థాలను తీసుకెళ్తున్న కంటెయినర్‌లో అకస్మికంగా మంటలు చెలరేగి దగ్ధమైన సంఘటన గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత చోటు చేసుకుంది. మహారాష్ట్ర నుంచి పరిశ్రమకు కావాల్సిన రసాయనిక పదార్థాలను తీసుకొస్తుండగా, జాతీయరహదారి గుండా సెజ్‌లోకి చేరుకున్న కొద్ది నిమిషాల్లో మంటలు చెలరేగాయి. గమనించిన డ్రైవర్ కంటెయినర్‌ను వెంటనే రోడ్డుపై ఆపి క్యాబిన్ నుంచి బయటకు దూకి తృటిలో బయటపడ్డాడు. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది హుటాహుటిని చేరుకుని మంటలను ఆర్పారు. అప్పటికే కంటెయినర్ అగ్నికి పూర్తిగా ఆహుతి అయ్యింది. దాదాపు రూ.కోటికి పైగా నష్టం వచ్చినట్లు ఫార్మా అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



పోలేపల్లి సెజ్‌లో దగ్ధం అవుతున్న కంటెయినర్

చిన్నోనిపల్లె నిర్వాసితులపై..

నాన్ బెయిలబుల్ కేసు

- 326/బీతో పాటు పలు సెక్షన్లను చేర్చిన పోలీసులు
- యాసిడ్ విసరడం, ప్రయత్నించడంపై కేసు నమోదు
- 5 నుంచి 7 ఏళ్ల వరకు శిక్ష

గట్టు: చిన్నోనిపల్లె భూనిర్వాసిత రైతులు కొందరిపై పోలీసులు నాన్‌బెయిలబుల్ కేసు నమోదు చేశారు. మే 22న కేసు నమోదు చేస్తే ఆగస్టులో రైతులకు విషయం తెలియడంతో వారు లబోదిబోమంటున్నారు. నాన్‌బెయిలబుల్ కేసు నమోదు చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చిన్నోనిపల్లె, ఇందువాసికి చెందిన ఆరుగురిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. చిన్నోనిపల్లె రిజర్వాయర్‌ను రద్దు చేయాలని చాగదోణ, చిన్నోనిపల్లె, లింగాపురం, బోయలగూడెం, ఇందువాసికి చెందిన నిర్వాసితులు ఏడాది కాలంగా నిర్వాసిత గ్రామంలో ఆందోళన చేస్తూ వచ్చారు. రిజర్వాయర్ రద్దు చేయాలంటూ దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఆందోళన చేసి, కేంద్ర మంత్రులకు వినతిపత్రాన్ని అందజేశారు. సీఎం కేసీఆర్‌కు నిర్వాసితులు పోస్టుకార్డుల ద్వారా విన్నవించారు. ఎన్ని చేసినా రిజర్వాయర్ బ్యాలెన్స్ పనులను పూర్తి చేసే క్రమంలో ఈ ఏడాది మార్చిలో కట్ట గ్యాప్‌ను పూడ్చే పనులను భారీ పోలీస్ బలగాల మోహరింపు మధ్య ప్రారంభించారు. ఆ తర్వాత కొన్నాళ్ల పాటు పనులు సాగినప్పటికి వర్షపు నీరు గ్రామంలోకి వచ్చే ప్రమాదం ఉందని, పునరావాసం పూర్తయిన తర్వాత పనులు చేపట్టాలని ఆందోళన చేస్తూ, పనులను అడ్డుకుంటూ వచ్చారు. విరామం తర్వాత మళ్లీ పనులను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయడంతో ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో పాత కేసును గుర్తు చేసినట్లు నిర్వాసితులు ఆందోళన చెందుతున్నారు.

నాన్ బెయిలబుల్ కేసు నమోదు..

మండల పోలీస్‌స్టేషన్‌లో మే 22న చిన్నోనిపల్లె, ఇందువాసికి చెందిన నిర్వాసితులపై క్రైమ్ నెంబర్ 59/23 ద్వారా సెక్షన్ 143, 147, 341, 326/బీ, 506 రెడ్‌విత్ 149 ఐపీసీ నమోదు చేసినట్లు రైతుల ద్వారా తెలిసింది. సైట్ ఇంజినీర్ వాసా ఉపేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. అయితే 326/బీ సెక్షన్ మాత్రం నాన్‌బెయిలబుల్. యాసిడ్‌తో దాడి చేయడం, యాసిడ్ దాడికి యత్నించిన సందర్భంలో ఇలాంటివి నమోదు చేస్తుంటారు. ఇది రుజువు అయితే 5 నుంచి 7ఏళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉంటుంది. భూమి కోసం పోరాడితే ఈ సెక్షన్లు పెట్టడడం ఎంత వరకు సమంజసమని నిర్వాసిత కుటుంబాలు వాపోతున్నాయి.

ఈ విషయం గురించి స్థానిక పోలీసులను వివరణ కోరగా కేసు నమోదైంది వాస్తమని తెలిపారు.

పంటపొలాన్ని నాశనం చేసిన ఇద్దరికి జైలుశిక్ష


గద్వాల క్రైం: అక్రమంగా పొలంలోకి ప్రవేశించడంతో పాటు పంటను నాశనం చేసిన ఇద్దరికి న్యాయమూర్తి రెండు నెలల జైలుశిక్షతో పాటు జరిమానా విధించారు. శుక్రవారం ఎస్పీ సృజన, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ భవాని తెలిపిన వివరాల ప్రకారం.. మల్దకల్ మండలం పాల్వాయికి చెందిన కుర్వ చిన్న తిమ్మప్ప 2005లో మహదేవమ్మ, గోవిందు దంపతుల నుంచి ఎకరా పొలాన్ని రూ.50వేలకు కొనుగోలు చేశాడు. అనంతరం పొలాన్ని తన పేరిట రిజిస్ట్రేషన్ చేసుకుని వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. 14ఏళ్ల తర్వాత గోవిందు కుమారులు కుర్వ అయ్యప్ప, కుర్వ శంకర్ పొలంలో తమకు భాగం వస్తుందని, ఇవ్వకుంటే చంపి తీసుకుంటామని చిన్న తిమ్మప్పను బెదిరింపులకు గురి చేస్తూ వస్తున్నారు. 2019 ఆగస్టు 28 నాడు అయ్యప్ప, శంకర్ చిన్న తిమ్మప్ప పొలంలోకి అక్రమంగా చొరబడి ఎద్దుల గడెంతో పత్తిపంటను నాశనం చేశారు. విషయాన్ని గమనించిన కొందరు రైతులు తిమ్మప్పకు సమాచారం ఇచ్చారు. తన పొలంలోకి అక్రమంగా చొరబడడంతో పాటు పత్తి పంటను నాశనం చేసిన అయ్యప్ప, శంకర్‌లపై చర్యలు తీసుకోవాలని అదే రోజు మల్దకల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్ఐ కృష్ణ ఓబుల్‌రెడ్డి విచారణ చేపట్టి నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. చార్జిషీట్ దాఖలు చేయగా, శుక్రవారం విచారణకు వచ్చింది. వివరాలను పరిశీలించిన అదనపు జూనియర్ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ఉదయ్‌నాయక్ ఘటన వాస్తవమేనని నిర్ధారించి నిందితులకు 2నెలల జైలుశిక్ష, ఒక్కొక్కరికి రూ.500జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు వారు తెలిపారు.

కలకలం రేపిన దొంగనోట్ల కథనం

కల్వకుర్తిరూరల్: నకిలీనోట్ల చలామణిపై శుక్రవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన ‘దొంగనోట్ల చలామణి’ కథనం నియోజకవర్గంలో కలకలం సృష్టించింది. ఇంటిలిజెన్స్ విభాగం దీనిపై ఆరా మొదలు పెట్టింది. ఇదిలా ఉండగా పేరు చెప్పడానికి వ్యక్తులు ఆసక్తికర అంశాలను పలువురితో పంచుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పట్టణంలోని ఒక వ్యక్తి తన అవసరం నిమిత్తం స్నేహితుడి వద్ద రూ.20వేలు ఆన్‌లైన్ ద్వారా తీసుకున్నాడు. ఆ తర్వాత డబ్బులు చెల్లించేందుకు ఓ బ్యాంకు నుంచి రూ.20వేలు డ్రా చేసి, డబ్బులు ఇచ్చిన వ్యక్తికి తిరిగి ఇచ్చాడు. అతను ఆ నగదును తీసుకుని అదే బ్యాంకులో తన ఖాతాలో జమ చేసేందుకు వెళ్లాడు. అందులో రూ.15వేల వరకు 500నోట్లు నకిలీవని బ్యాంకు అధికారులు తేల్చారు. ఆ నోట్లను తనకు ఇచ్చిన వ్యక్తి ద్వారా అదే బ్యాంకుకు వెళ్లి ప్రశ్నించగా, నకిలీ నోట్లను తీసుకుని అసలువి ఇచ్చినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ నకిలీ నోట్ల వ్యవహారంపై బ్యాంకు అధికారుల పాత్ర కూడా స్పష్టంగా కనిపించడంతో పట్టణవాసులు ఆందోళన చెందుతున్నారు. వ్యాపారులు నోట్లను ఎంత పరిశీలించినా అనుమానం రాని విధంగా ఉన్నాయి. ప్రస్తుతం దొంగ నోట్ల చలామణిపై సమగ్ర విచారణ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

జూరాలకు తగ్గిన ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం 15వేల క్యూసెక్కులకు తగ్గింది. ఆవిరి రూపంలో 112, నెట్టెంపాడు ఒక పంపు ద్వారా 750, భీమా లిఫ్టు–1కు 650, కోయిల్‌సాగర్‌కు 315, జూరాల ఎడమ కాల్వ ద్వారా 870, కుడి కాల్వ ద్వారా 630, సమాంతర కాల్వకు 400, భీమా లిఫ్టు –2కు 750 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 3,597 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.531 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువన ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు స్వల్ప వరద కొనసాగుతున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆల్మట్టి ప్రాజెక్టుకు ప్రస్తుతం 14వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 14వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 129.72 టీఎంసీలు కాగా, 122.6 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నారాయణపూర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 37.64 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 32.79 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టుకు 14వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 14వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



వరద నీటితో కళకళలాడుతున్న జూరాల రిజర్వాయర్

నాలుగు యూనిట్లలో విద్యుదుత్పత్తి

ఆత్మకూర్: జూరాల ప్రాజెక్టు దిగువ, ఎగువ జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో ఉత్పత్తి కొనసాగుతుంది. ఇన్‌ఫ్లో తగ్గడంతో శుక్రవారం 4 యూనిట్ల ద్వారా ఉత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈ రామసుబ్బారెడ్డి తెలిపారు. ఎగువలో 3 యూనిట్ల ద్వారా 117 మెగావాట్లు, 66.017 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేయగా, దిగువలో ఒక యూనిట్ ద్వారా 40 మెగావాట్లు, 69.433 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని సాధించారు. ఇప్పటివరకు 135.450 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేపట్టారు.

కోయిల్‌సాగర్‌లో 27 అడుగుల నీటిమట్టం

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నీటిమట్టం 27 అడుగులకు చేరుకుంది. వర్షాలు తగ్గడంతో పెద్ద వాగు ప్రవాహం నిలిచిపోయింది. జూరాల నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా ఒక మోటార్ రన్ చేసి 315 క్యూసెక్కుల నీటిని కోయిల్‌సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ద్వారా వానాకాలం పంటలకు నీటి విడుదల కొనసాగుతుంది. ప్రాజెక్టు అలుగు స్థాయి నీటి మట్టం 26.6 అడుగులు కాగా, ప్రస్తుతం 0.6 అడుగుల నీరు అలుగుపైకి వచ్చింది. ప్రాజెక్టు గేట్ల స్థాయి నీటి మట్టం 32.6 అడుగులు కాగా మరో 5.6 అడుగుల నీరు చేరితే గేట్లను తెరిచే అవకాశం ఉంది.

శ్రీశైలంలో 864.7 అడుగుల నీటిమట్టం

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో శుక్రవారం 864.7 అడుగుల నీటిమట్టం, 121.2 టీఎంసీల నీటి నిల్వ ఉంది. సాయంత్రం 6గంటల సమయంలో టీఎస్ జెన్‌కో పరిధిలోని భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 38,140, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 4,981 క్యూసెక్కులు నీటిని దిగువన నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. 24 గంటల వ్యవధిలో రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 2,400 క్యూసెక్కులు, భూగర్భ కేంద్రంలో 10.283 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి 19,460 క్యూసెక్కుల నీటిని వదిలారు. శ్రీశైలం జలాశయంలో 326 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

ఆర్టీసీ ఉద్యోగులకు ఇక ట్రెజరీ జీతాలు!

బిల్లుకు గవర్నర్ ఆమోదముద్ర పడితే ఈ నెల నుంచే..

- ఏదైనా జాప్యం జరిగితే వచ్చే నెల నుంచి అమలు
- ఉద్యోగుల హోదాలు, వేతనాల వివరాలను సిద్ధం చేస్తున్న ఆర్టీసీ ఉన్నతాధికారులు
- అయోమయానికి తావు లేకుండా కొన్నిరోజులు బదిలీలు, పదోన్నతులపై ఆంక్షలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) ఉద్యోగులకు ప్రభుత్వ ట్రెజరీ నుంచి జీతాలు పంపిణీ చేసేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. కుదిరితే ఈ నెల నుంచే ప్రభుత్వ జీతాలు అందేలా ఆర్థిక శాఖతో సమన్వయం చేసుకుంటూ ఆర్టీసీ ఏర్పాట్లు చేస్తోంది. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే బిల్లును అసెంబ్లీ ఆమోదించిన విషయం తెలిసిందే. దీనికి గవర్నర్ ఆమోదముద్ర పడగానే చట్టబద్ధత రానుంది. ఈ క్రమంలో అటు గవర్నర్ ఆమోద ముద్ర కోసం ఎదురుచూస్తూనే.. ఇదే సమయంలో ఆర్టీసీ ఉద్యోగులకు సంస్థ నుంచి కాకుండా నేరుగా ప్రభుత్వం నుంచే జీతాలు విడుదలయ్యేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు ఆర్థిక శాఖ తాజాగా ఆర్టీసీ ఉద్యోగుల వివరాలు ఇవ్వాలని కోరింది. దీంతో.. ఉద్యోగి పేరు, హోదా (డెజిగ్నేషన్), పనిచేస్తున్న విభాగం, ఆధార్‌కార్డు, ప్రస్తుతం అందుకుంటున్న జీతం వివరాలను ఆధార సహితంగా జాబితా రూపంలో ఆర్టీసీ సిద్ధం చేస్తోంది.

ఈ నెల 16 తర్వాత బదిలీలు వద్దు

ఉద్యోగులు, జీతాల జాబితాలను ఆయా విభాగాధిపతులు సిద్ధం చేసి బస్‌భవన్‌కు పంపితే, అక్కడి నుంచి ఆర్థిక శాఖకు చేరనున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో సిబ్బంది ఎక్కడివారు అక్కడే ఉంటే జాబితాలో అయోమయం లేకుండా ఉంటుందన్న ఉద్దేశంతో.. ఆర్టీసీలో ఈనెల 16వ తేదీ తర్వాత బదిలీలు, పదోన్నతులకు వీలు లేకుండా ఆదేశాలు వెలువడ్డాయి. పదోన్నతులు, బదిలీల వంటివి ఆలోగానే పూర్తి చేయాల్సి ఉంటుంది. 16వ తేదీ తర్వాత ఉద్యోగుల వివరాలను సిద్ధం చేసి, ఆర్థిక శాఖకు పంపనున్నారు. ఈ మేరకు ఆర్థికశాఖ జీతాల పద్దును సిద్ధంచేసి ట్రెజరీకి పంపుతుంది. ఆలోగా ఆర్టీసీ బిల్లుకు గవర్నర్ ఆమోదం వస్తే.. ప్రస్తుత నెల జీతాలను ట్రెజరీ నుంచి విడుదల చేసేందుకు మార్గం సుగమం అవుతుంది. ఒకవేళ జాప్యం జరిగితే.. ఈ నెలకు ఆర్టీసీ నుంచే జీతాలిచ్చి, వచ్చే నెల నుంచి ట్రెజరీ ద్వారా విడుదల చేసే అవకాశం ఉంటుంది.

కొంతకాలం ప్రస్తుత వేతనాలే..!

ఆర్టీసీ ఉద్యోగులు ప్రభుత్వంలో విలీనమైనా కొంతకాలం ప్రస్తుతమున్న వేతనాలే అందనున్నాయి. ఎందుకంటే ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలోని వివిధ హోదాలు, కేడర్లకు సమానంగా నిర్ధారించాల్సి ఉంటుంది. అప్పుడు ఆయా కేడర్లను బట్టి వేతనాల్లో మార్పులు చేర్పులు జరుగుతాయి. త్వరలో ప్రభుత్వం నియమించనున్న అధికారుల సబ్ కమిటీ దీనికి సంబంధించి విధివిధానాలను రూపొందించాల్సి ఉంటుంది. సదరు కమిటీ ఏర్పాటై, వివరాలు కోరగానే అందజేసేందుకు వీలుగా.. ఆర్టీసీ ఉన్నతాధికారులు నివేదికలను సిద్ధం చేస్తున్నారు. ఏపీలో ఇంతకుముందే ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనంచేసిన నేపథ్యంలో.. అక్కడ అనుసరించిన పద్ధతులు, ఎదురైన ఇబ్బందులు, వాటి పరిష్కారానికి ఏపీ ప్రభుత్వం తీసుకున్న చర్యలను పరిశీలించేందుకు ఇటీవలే టీఎస్ ఆర్టీసీ ఉన్నతాధికారులు విజయవాడ వెళ్లి వచ్చారు. తెలంగాణ ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలు కూడా విజయవాడ వెళ్లి అధ్యయనం చేసి వస్తున్నారు.

మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌పై కేసు

- మరో పది మందిపై కూడా..
- ఎన్నికల అఫిడవిట్ ట్యాంపరింగ్‌లో నాంపల్లి కోర్టు ఆదేశాల మేరకు చర్యలు



మహబూబ్‌నగర్ క్రైం/సాక్షి, హైదరాబాద్: నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు మరో పదిమందిపై కేసులు నమోదయ్యాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో అఫిడవిట్ ట్యాంపరింగ్ చేశారనే ఆరోపణల నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం 4 గంటలలోగా కేసు నమోదు చేయాలని కోర్టు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు మహబూబ్‌నగర్ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో పోలీసులు 11 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్టు విశ్వసనీయవర్గాల సమాచారం. నేడు రెండవ శనివారం, 13న ఆదివారం సెలవు ఉండటంతో 14న కోర్టుకు కేసుకు సంబంధించిన నివేదిక ఇవ్వడానికి పోలీసులు సిద్ధమైనట్టు సమాచారం

ఇదీ కేసు..

ఎన్నికల అఫిడవిట్ ట్యాంపరింగ్‌పై దాఖలైన కేసులో మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు రాష్ట్ర, కేంద్ర రిటర్నింగ్ అధికారులపై కేసు నమోదు చేయాలని నాంపల్లి కోర్టు పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. 2018, డిసెంబర్‌లో ఎన్నికలు జరిగిన సమయంలో దాఖలు చేసిన అఫిడవిట్‌ను శ్రీనివాస్‌గౌడ్ ట్యాంపరింగ్ చేశారని, అయినా అధికారులు పట్టించుకోలేదని పేర్కొంటూ మహబూబ్‌నగర్‌కు చెందిన రాఘవేంద్రరాజు నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో దావా వేశారు. దీనిపై వాదనలు విన్న న్యాయమూర్తి, మంత్రి సహా సదరు అధికారులపై కేసు నమోదు చేయాలని తీర్పునిచ్చారు.

కేసు నమోదైంది వీరిపైనే..

మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు అప్పటి అధికారులు, ప్రస్తుత ఎలక్షన్ కమిషనర్ ఆఫ్ ఇండియా అండర్ సెక్రెటేరియల్ రాజీవ్‌కుమార్, సంజయ్‌కుమార్, రాష్ట్ర ఎన్నికల అధికారి శశాంక్‌గోయల్, సెక్రెటరీ, ఆర్థికశాఖ కార్యదర్శి రోనాల్డ్ రాస్, కలెక్టర్ వెంకట్రావు, డిప్యూటీ కలెక్టర్ పద్మశ్రీ, ఆర్డీఓ శ్రీనివాసులు, టెక్నికల్ అధికారి వెంకటేష్‌గౌడ్, విశ్రాంత ఉద్యోగి సుధాకర్, న్యాయవాది రాజేంద్ర ప్రసాద్‌పై కేసు నమోదైనట్టు సమాచారం.

గిట్టనివారి అంతు చూస్తారట!

- ఇందుకోసమే వారికి అధికారం ఇవ్వాలట..
- బాబు, అతని దత్తపుత్రుడు, సొంత పుత్రుడిపై నిప్పులు చెరిగిన ఏపీ సీఎం జగన్



75 ఏళ్ల ముసలాయన, ఆయన దత్తపుత్రుడు, సొంత పుత్రుడు మాట్లాడుతున్న మాటలు వినండి. అధికారం ఇస్తే ఏం చేస్తారో వీళ్ల నోటితో వీళ్లే చెప్పారు. తనకు అధికారం ఇస్తే ఎవరినీ వదలడట.. తనకు గిట్టని వారి అంతు చూస్తాడట.. మట్టుబెడతాడట.. ఉగ్రరూపం చూపిస్తాడట.. ఏకంగా నరకం చూపిస్తాడట.. ఇందు కోసం ఆయనకు అధికారం ఇవ్వాలట! ఇదీ ఈ పెద్దమనిషి నైజం. ఇలాంటి ఆయన కోసం ఆయన దత్తపుత్రుడు పరుగెడుతున్నాడు. ఈ పెద్దమనిషికి ఏనాడైనా ప్రజలకు మంచి చేసిన చరిత్ర ఉందా? ఫలానా పని చేశానని చెప్పుకోవడానికి ఏమీ లేకే రెచ్చగొట్టి గొడవలు సృష్టించి పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారు. ఇదేం రాజకీయం? – సీఎం వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, కాకినాడ/సాక్షి, అమలాపురం: 'చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు, సొంత పుత్రుడు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేస్తామని ఎక్కడా చెప్పడం లేదు. అలా చెబితే ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. అందుకే గొడవలు సృష్టించి ప్రజల మధ్య చిచ్చుపెట్టి లబ్ధి పొందాలని చూస్తున్నారు. యాత్రలు, సభల పేరుతో ప్రజలను రెచ్చగొడుతున్నారు' అని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిప్పులు చెరిగారు. అమలాపురంలో వైఎస్సార్ సున్నా వడ్డీ నాలుగో విడత నిధుల విడుదల సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఈ రోజు నిజంగా వీళ్లందరి ఆలోచన ఏ స్థాయిలో ఉందో ప్రజలు గమనించాలని కోరారు. 'వారు మంచి చేస్తామంటే ప్రజలు నమ్మరని వాళ్లకు తెలుసు. కాబట్టే ప్రజల్ని రెచ్చగొట్టాలని చూస్తున్నారు. అబద్ధాలు చెబుతున్నారు. ప్రతి రోజూ మోసాలు చేస్తారు. మీటింగులు పెట్టి ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారు. చివరకు 47 మంది పోలీసులపై దాడి చేశారు. ఇలాంటి రాక్షసులకు ఎందుకు సెక్యూరిటీ ఇవ్వాలని అనిపించింది. ఎక్కడికక్కడ ప్రజల్ని రెచ్చగొట్టి గొడవలు సృష్టిస్తున్న వారి పట్ల మనమంతా చాలా జాగ్రత్తగా ఉండాలి' అని సూచించారు. ఈ సభలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

శవ రాజకీయాలు చేస్తున్నారు.

- మొన్న అంగళ్లలో చంద్రబాబు తానే స్వయంగా రెచ్చగొట్టి గొడవలు చేయించారు. మళ్లీ పుంగనూరులో ఒక రూటుకు అనుమతి తీసుకొని ఆ రూట్లో పోకుండా పుంగనూరుకు వచ్చి వేరే రూట్లో పోవాలని ప్రయత్నించారు. అప్పుడే పోలీసులు మీకు అనుమతి లేదని.. అక్కడ అధికార పార్టీ వాళ్లు నిరసన కార్యక్రమం చేసుకుంటున్నారు.. లా అండ్ ఆర్డర్ ప్రాబ్లమ్ వస్తుందని చెప్పారు.
- దీంతో చంద్రబాబు వారిని ఇష్టమొచ్చినట్లు తిట్టాడు. వాళ్ల క్యాడర్‌ను రెచ్చగొట్టి 47 మంది పోలీసులను గాయపరిచారు. ఒక పోలీసు సోదరుడికి కన్ను కూడా పోగొట్టాడు. కారణం గొడవలు జరగాలి. శవ రాజకీయాలు చేయాలన్నదే ఆలోచన. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ–5 వాళ్లదే. వాళ్లు ఏం చెబితే అది రాస్తారు. మైకులు పట్టుకొని దత్తపుత్రుడు రెడీగా ఉన్నాడు

నోరు తెరిస్తే అబద్ధాలే

- 2014కు ముందు ఈయన మాట్లాడిన మాటలు గుర్తుకు తెచ్చుకోండి. బ్యాంకుల్లో పెట్టిన బంగారం ఇంటికి రావాలంటే బాబు రావాలి అన్నారు. రైతుల రుణాలు మాఫీ కావాలంటే బాబు రావాలట. అక్కచెల్లెమ్మలకు పొదుపు సంఘాల రుణాలు మాఫీ కావాలంటే బాబు రావాలట. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు రావాలంటే బాబు రావాలంటూ మోసం చేశాడు. రూ.85,712 కోట్ల రుణాలు మాఫీ చేస్తానని చెప్పి, చేయకుండా రైతులను నిలువునా మోసం చేశాడు.
- రూ.14,207 కోట్ల పొదుపు సంఘాల రుణాలు మాఫీ చేస్తానని మోసం చేశాడు. చివరకు చదువుకుంటున్న పిల్లలనూ వదల్లేదు. ఉద్యోగం ఇస్తాను లేదా ఉపాధి కల్పిస్తాను అని నిస్సిగ్గుగా అబద్ధాల వాగ్దానాలు చేశాడు. లేదంటే ఇంటింటికీ రూ.2 వేలు నిరుద్యోగ భృతి ఇస్తానన్నాడు. ప్రతి ఇంటికీ రూ.2 వేలు అంటే ప్రతి పిల్లాడికీ ఏటా రూ.24 వేలు అలా ఐదేళ్లలో రూ.లక్షా 20 వేలు మోసం చేశాడు.

నాడు, నేడు అదే బడ్జెట్..

- చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు కూడా ఇదే బడ్జెట్, ఇదే రాష్ట్రం. అప్పులు కూడా అప్పటికన్నా ఇప్పుడే తక్కువ. కేవలం సీఎంమారాడు. మీ బిడ్డకు ఓటు వేయకపోయినా ఫర్వాలేదు..కచ్చితంగా వారికి రావాల్సినవి రా వాలని ప్రయత్నం చేశాడు. మీ బిడ్డ ఎలా చేయగలుగుతున్నాడు.. అప్పట్లో ఇదే చంద్ర బాబు ఎందుకు చేయలేకపోయాడని ఆలోచించండి.
- మీ బిడ్డ మీ కోసం ఎక్కడా లంచాలు, వివక్ష లేకుండా రూ.2.31 లక్షల కోట్లు నేరుగా బటన్ నొక్కి మీ అకౌంట్లలోకి పంపించాడు. ఈ నాలుగేళ్లలో ఇంతటి సంక్షేమాభివృద్ధిని ఏనాడైనా చూశామా? చంద్రబాబు హయాంలో సామాజిక న్యాయం ఉందా? నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజకీయంగా ఇన్ని పదవులు ఏనాడైనా ఇచ్చారా? ఏనాడైనా మీ బిడ్డల భవిష్యత్ గురించి ఆలోచన చేశాడా? చివరకు పేదింటి పిల్లలు ఇంగ్లిష్ మీడియం చదవాలంటే కూడా వద్దన్న చరిత్ర ఆయనది.
- చంద్రబాబు అధికారంలో ఉండగా ఇలా 30 లక్షల ఇళ్ల పట్టాలు ఇచ్చి.. ఇళ్లు కట్టించడం ఎప్పుడైనా చేశారా? ఇలా చేయలేకపోయిన ఈ 75 ఏళ్ల ముసలాయన వాటిని అడ్డుకోవడంలో మాత్రం ముందుంటారు. దత్తపుత్రులు ఎందుకిలా పరుగెడుతున్నాడంటే ఆయన సీఎం కావడానికి కాదట. ఈ ముసలాయన్ను సీఎం కుర్చీలో కూర్చోబెట్టడానికట. ఇలాంటి వ్యక్తి సీఎం అయితే మనకు మంచి జరుగుతుందా?
- మీకు మంచి చేయడానికి వస్తున్న వలంటీర్లను కూడా వదలకుండా ఎంత దారుణంగా మాట్లాడారు. రాబోయే రోజుల్లో వీళ్ల నీచ రాజకీయాలు, అబద్ధాలు ఇంకా ఎక్కువ అవుతాయి. ప్రతి ఇంటికీ కేజీ బంగారం, బెంజ్ కారు కొనిస్తామని చెబుతారు. నాకు ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ–5, దత్తపుత్రుడు అండగా లేరు. మీ బిడ్డ నమ్ముకున్నది దేవుడి దయ, మీ దీవెనలనే. మీ ఇంట్లో మీకు మంచి జరిగి ఉంటే మాత్రం మీ బిడ్డకు మీరే సైనికులుగా నిలబడండి.

భావితరాల కోసం నీటి వనరులను కాపాడండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: భావితరాల వారి కోసం నీటివనరులను కాపాడాల్సిన అవసరం ఉందని, లేదంటే వారు క్షమించరని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు స్పష్టం చేసింది. ఇదే విషయాన్ని ప్రతిసారి చెబుతున్నా పట్టనట్లు వ్యవహరించడం సహించరానిదని వ్యాఖ్యానించింది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ(హెచ్ఎండీఏ) పరిధిలోని చెరువులు, కుంటల బఫర్ జోన్లపై అఫిడవిట్ అందజేయాలని ఆదేశించింది. హెచ్ఎండీఏ పరిధిలోని చెరువులు, కుంటల బఫర్ జోన్లు ఏర్పాటు చేయాలని, ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్)ను నిర్ధారించాలని గతంలో లేక్ ప్రొటెక్షన్ కమిటీని ఆదేశించినా నివేదిక అందజేయకపోవడంపై కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. చెరువుల ఎఫ్‌టీఎల్‌ను కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదంటూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్)పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ వినోద్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. చెరువుల బఫర్ జోన్లను గుర్తించారా?, హెచ్ఎండీఏ పరిధిలోని చెరువులు ఎన్ని? అని ప్రభుత్వ న్యాయవాదిని ప్రశ్నించింది. లేక్ ప్రొటెక్షన్ కమిటీ తరఫు న్యాయవాది స్పందిస్తూ హెచ్ఎండీఏ పరిధిలో మొత్తం 3,532 సరస్సులు ఉన్నాయని, 239 సరస్సులకు బఫర్ జోన్లు గుర్తించామని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం.. అఫిడవిట్ వేయాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను 19వ తేదీకి వాయిదా వేసింది.

కేసులో కావాలనే ఇరికించారు.. బెయిల్ ఇవ్వండి

హైకోర్టులో వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్ పిటిషన్లు

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో తమను సీబీఐ కావాలనే ఇరికించిందని, తమకు బెయిల్ ఇవ్వాలని వైఎస్ భాస్కర్‌రెడ్డి, గజ్జల ఉదయ్‌కుమార్‌రెడ్డి హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. సీబీఐ కోర్టు తమ బెయిల్ పిటిషన్లను కొట్టివేయడాన్ని సవాల్ చేస్తూ వైఎస్ భాస్కర్‌రెడ్డి, గజ్జల ఉదయ్‌కుమార్‌రెడ్డి వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. వివేకా హత్యకేసులో దర్యాప్తు పూర్తయిందని, సీబీఐ అభియోగ పత్రాన్ని కూడా దాఖలు చేసిందని తెలిపారు. ఈ కేసులో పిటిషనర్లను అక్రమంగా ఇరికించారని, వారికి వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలు కోర్టుకు సమర్పించలేదన్నారు. ఇప్పటికే 5 నెలలకు పైగా జైలులో ఉన్నారని, భాస్కర్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితి సరిగా లేదని చెప్పారు. పలుమార్లు జైలు అధికారులు అస్పత్రుల్లో భాస్కర్‌రెడ్డికి పరీక్షలు కూడా నిర్వహించారన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. కౌంటర్ దాఖలు చేయాలని సీబీఐకి నోటీసులు జారీ చేసింది.


ప్లాస్టిక్ బియ్యం కలకలం

- రేషన్ బియ్యంతో వండిన అన్నం రబ్బర్‌లా సాగుతుందని మహిళల ఆరోపణ



ధరూరు: రేషన్ షాప్ ద్వారా ఇస్తున్న బియ్యంతో వంట వండగా.. అవి రబ్బర్‌లా సాగుతుండడంతో మండల కేంద్రంలో మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులుగా మండల కేంద్రంలోని రేషన్ దుకాణం ద్వారా బియ్యం పంపిణీ చేశారు. శుక్రవారం ఎస్సీ కాలనీకి చెందిన జయమ్మ, రంగమ్మ వంట వండుతుండగా అన్నం ఉడికిందా లేదా అని మెతుకులను నొక్కి చూడగా.. అవి ఎంత వరకు మెత్తగ కాకపోవడంతో అనుమానం వచ్చి పొయ్యి మీద నుంచి కిందకు దించి చూశారు. రబ్బర్‌లా సాగుతుండడంతో ఆందోళన చెందారు. గిన్నెలో నానబెట్టిన క్రమంలో కొన్ని బియ్యం పైకి తేలిపోతున్నాయని వారు తెలిపారు. మొన్నటి వరకు సన్న బియ్యం సరఫరా చేసి, ఈ నెల లావు బియ్యం వేశారని, నాణ్యమైన సన్న బియ్యం అందించాలని, అధికారులు స్పందించి దీనిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కేంద్ర బృందం పర్యటన



ఆత్మకూర్: మండలంలోని రేచింతల, కత్తేపల్లి గ్రామాలను కేంద్ర బృందం శుక్రవారం సందర్శించింది. పర్యటనలో భాగంగా కేంద్ర సభ్యులు మౌనిక, నాగమణి పంచాయతీల వద్ద గ్రామస్తులతో సమావేశమయ్యారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనుల గురించి ఆరా తీశారు. ఇంటింటికీ వెళ్లి పరిసరాల పరిశుభ్రత, చెత్త సేకరణ వివరాలను తెలుసుకున్నారు. గ్రామాల్లోని డంపింగ్ యార్డులు, ఇంకుడు గుంతలు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, ప్రభుత్వ పాఠశాలలు, ఆలయాలు, ఎరువుల తయారీ, ఇంకుడు గుంతలు ఇతర విషయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వారి వెంట ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎంపీఓ నర్సింగ్‌రావు, ఏపీఓ విజయభాస్కర్‌రెడ్డి, సర్పంచ్‌లు ఉన్నారు.

కనులపండువగా గ్రామోత్సవం



వాలీబాల్ సర్వీస్ చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, చిత్రంలో జెడ్పీచైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి

- పల్లె వాతావరణాన్ని తలపించేలా వేడుకలు
- పాటలతో అలరించిన సింగర్లు మంగ్లీ, రామ్ మిర్యాల

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో శుక్రవారం కనుల పండువగా 15వ ఈశా గ్రామోత్సవం ప్రారంభమైంది. రాష్ట్రంలో మొదటగా జిల్లాలో ఈ వేడుకలను నిర్వహిస్తున్నారు. ఇందులో పురుషులకు వాలీబాల్, మహిళలకు త్రోబాల్ పోటీలు నిర్వహించనున్నారు.

పల్లె వాతావరణాన్ని తలపించేలా..

మెయిన్ స్టేడియంలోని వాలీబాల్‌కోర్టు ఎదుట పల్లె వాతావరణం తలపించేలా గడ్డితో గుడిసె ఏర్పాటు చేయడంతోపాటు ఎద్దులబండి, ఆవులు ఉంచారు. వాలీబాల్ కోర్టులో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా జానపద ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మహిళల కోలాటం, పురుషుల డప్పుల మోతతో స్టేడియం హోరెత్తింది. వేడుకలను చూడడానికి విద్యార్థులు, యువత అధిక సంఖ్యలో స్టేడియానికి తరలివచ్చారు.

త్వరలో అంతర్జాతీయ క్రీడలు నిర్వహిస్తాం: మంత్రి శ్రీనివాస్‌గౌడ్

జిల్లా కేంద్రంలోని స్టేడియంలో అధునాతన సౌకర్యాలతో ఇండోర్ స్టేడియం నిర్మాణం చేస్తున్నామని, త్వరలో జిల్లాలో అంతర్జాతీయ క్రీడలు నిర్వహిస్తామని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంత్రి ముఖ్య అతిథిగా హాజరై క్రీడలను ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ సేవ్ సాయిల్ నినాదంతో మట్టిని కాపాడడంలో సద్గురు ఎంతో కీలకమైన భూమిక పోషించారని, ఇప్పుడు గ్రామోత్సవం క్రీడా పోటీల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. క్రీడలు మహబూబ్‌నగర్ నుంచి ప్రారంభం కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కలెక్టర్ రవినాయక్ మాట్లాడుతూ గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఫౌండేషన్ క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇలాంటివి క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంతకుముందు ఈశా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సద్గురు ప్రసంగించిన వీడియోను ప్రదర్శించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, ఎస్పీ నరసింహ, మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, వైస్ చైర్మన్ తాటి గణేష్, డీవైఎస్‌ఓ ఎస్.శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రహెమాన్, ఈశా ఫౌండేషన్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

తొలి రోజు ఫలితాలు

మహిళల త్రోబాల్‌లో టంకర జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో టంకర (రుద్రమదేవి) జట్టు 2–1 సెట్ల తేడాతో రాజాపూర్ జట్టుపై విజయం సాధించింది. మూడోస్థానంలో మహ్మదాబాద్ జట్టు, నాల్గోస్థానంలో నవాబ్‌పేట జట్టు నిలిచాయి.



అలరించిన సినీగాయకుల పాటలు..

ప్రారంభోత్సవంలో ప్రముఖ సినీగాయకులు మంగ్లీ, రామ్ మిర్యాల పాటలను ఆకట్టుకున్నాయి. ముందుగా రామ్ మిర్యాల ఈశా గ్రామోత్సవంపై రూపొందించిన ఆడుదాం ఆట పాటను చక్కగా పాడారు. అనంతరం బలగం సినిమాలోని ఊరు పల్లెటూరు పాటను మంగ్లీ, రామ్ మిర్యాల పాడి ఉర్రూతలూగించారు. ఇతర పాటలు పాడడంతో స్టేడియంలో విద్యార్థుల కేరింతలతో సందడి నెలకొంది.



ఈశా గ్రామోత్సవం వేడుకలను తిలకిస్తున్న విద్యార్థులు



స్టేడియం ఎదుట పల్లెవాతావరణం

జేఎల్‌ఎం పోస్టుల భర్తీకి కమిటీ

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): విద్యుత్‌శాఖలో జూనియర్ లైన్‌మన్ నియామకానికి ఆ శాఖ ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేశారు. ఇందులో సీజీఎం చైర్మన్‌గా, ఎస్ఈ కన్వీనర్‌గా, డీఈ, అసిస్టెంట్ సెక్రటరీలు సభ్యులుగా ఉన్నారు. చైర్మన్‌గా బాలస్వామి, కన్వీనర్‌గా శ్రీరాంమూర్తి, సభ్యులుగా చంద్రమౌళి, రవికుమార్, వినాయక ప్రసాద్, తిరుపతిరావు, శ్రీనివాసులు, అసిస్టెంట్ సెక్రటరీగా రమేష్‌బాబు కమిటీలో ఉంటారు. ఈనెల 28వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జేఎల్‌ఎం ఎంపిక కోసం కరెంట్ స్తంభం ఎక్కే పరీక్షను నిర్వహిస్తారు.

ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ



వాడ్యాల్‌లో పాదయాత్ర చేస్తున్న అనిరుధ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు

మిడ్జిల్: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతులకు ఏకకాలంలో రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తామని టీపీసీసీ కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి హామీ ఇచ్చారు. విరామం తర్వాత శుక్రవారం ప్రజాహిత పాదయాత్ర రాణిపేట్‌లోని బంగారు మైసమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మున్ననూర్, వాడ్యాల్, వేముల, మసిగొండ్లపల్లి మీదుగా చేపట్టారు. గ్రామాలలో ప్రజలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల కోసం ఇప్పుడు రుణమాఫీ ప్రకటించడంతో, వచ్చిన డబ్బులు వడ్డీలకే సరిపోతున్నాయని అన్నారు. 9ఏళ్లుగా గుర్తులేని పథకాలను ఎన్నికలలో జిమిక్కులతో ప్రజలను మోసం చేసేందుకు కొత్త పథకాలు పెట్టి మరోసారి మోసం చేస్తున్నారని విమర్శించారు. గతంలో హామీ ఇచ్చిన దళిత ముఖ్యమంత్రి, దళితులకు ఇస్తానన్న మూడు ఎకరాల భూమి ఏమైందని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఆందోళనలతో రైతు రుణమాఫీ ప్రకటించారని, రైతుబంధు కూడా అసంపూర్తిగానే ఇచ్చారని అన్నారు. వాడ్యాల్‌లో ఏళ్ల తరబడి డబుల్‌బెడ్రూం ఇళ్లు అసంపూర్తిగానే ఉన్నాయన్నారు. దీన్ని చూస్తే ఎమ్మెల్యే పనితీరు అర్థమవుతుందని తెలిపారు. తనకు ఒకసారి ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. నిరుద్యోగ యువతకు భృతి, రైతులకు నిరంతరం ఉచిత విద్యుత్, రుణమాఫీ, అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామన్నారు. పాదయాత్రలో టీపీసీసీ కార్యదర్శి రబ్బానీ, అల్వాల్‌రెడ్డి, సంపత్, గౌస్, రాజారెడ్డి, జంగయ్య, రాజేష్, వెంకటేష్ గౌడ్, జహంగీర్, కృష్ణగౌడ్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

'ఆమ్ ఆద్మీ' ఎల్లప్పడూ ప్రజల పక్షమే



మిస్డ్‌కాల్ ప్రచారపోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

- రాష్ట్ర ఇన్‌చార్జ్ కన్వీనర్ దిడ్డి సుధాకర్

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆమ్ ఆద్మీ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షంగా ఉంటుందని రాష్ట్ర ఇన్‌చార్జ్ కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌స్థాయి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఢిల్లీలో కార్పొరేట్ సంస్థలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రులను అన్ని విధాలుగా తీర్చిదిద్దినట్లు చెప్పారు. ఉచిత విద్య, వైద్యంతోపాటు రాజ్యాంగంలో పొందుపరిచిన సామాన్యునికి కావల్సిన మౌలిక వసతులు కల్పిస్తూ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆమ్‌ఆద్మీ పార్టీ ప్రజల మన్ననలు పొందిందన్నారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బాబుల్‌రెడ్డి మాట్లాడుతూ.. అరవింద్ కేజ్రీవాల్ నాయకత్వంలో నడుస్తున్న పార్టీ మూడు పర్యాయాలు అధికారం చేపట్టి ప్రజల సంక్షేమానికి పాటుపడుతున్నట్లు తెలిపారు. దేశ ప్రజల మన్ననలు పొంది అతికొద్ది సమయంలోనే జాతీయ పార్టీగా ఎదిగిందన్నారు. అనంతరం ఉమ్మడి జిల్లాలోని 14 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇన్‌చార్జ్ సహాయ ఇన్‌చార్జ్, యువత, విద్యార్థి, మండలం, ఇతర నియామక బాధ్యతలు అప్పగించారు. పార్టీలో చేరేలా మిస్డ్‌కాల్ ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో పార్లమెంట్ కోఆర్డినేటర్లు అంబరీష్, శ్రీనివాస్, నాయకులు వెంకటేష్, ఎల్లప్ప, పరమేశ్వర, నగేష్, ఎక్బాల్, భానుప్రసాద్, రాకేష్, రాములు, సతీష్‌రెడ్డి, బండారు ప్రభుదాస్, నజీర్, మహ్మద్ పాష తదితరులు పాల్గొన్నారు.